సాక్షి వరంగల్
ఆదివారం । 30 । జూలై । 2023





**పునరుద్ధరణ పనులు ముమ్మరం**

భారీ వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు తెలిపారు. - 8లో▸



**సర్వస్వం పోయింది.. ఆదుకోండి**

మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31.0^0$ /$24.0^0$

**వాతావరణం**

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తి: మండలంలోని కిష్టాపురం ఎక్స్ రోడ్డుకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ధన్‌సింగ్ కుమారుడు రాములు అనారోగ్యంతో మృతిచెందగా శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు నర్సింహాచార్యులు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీని పరిరక్షించుకోవాలి



నర్సంపేట: ఆర్టీసీ ప్రజా రవాణా వ్యవస్థను పరిరక్షించుకోవాలని రాజకీయ పార్టీల ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సేవ్ ఆర్టీసీ అనే అంశంపై శనివారం గుంపెల్లి మునీశ్వర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కందిక చెన్నకేశవులు, నర్సింగరావు, ఎండీ.జావేద్, రాజాసాహెబ్, గుంపెల్లి మునీశ్వర్, అక్కపెల్లి రమేష్, సారంగం మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. ప్రజా రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి సూర్యప్రకాశ్ రావు, గోవర్దన్ మియాపురం, మైదానం యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

### చేయి చేయి కలిపి.. రోడ్డు బాగు చేసి..!



గీసుకొండ: మండలంలోని చంద్రయ్యపల్లి–మనుగొండ రోడ్డు భారీ వర్షాల కారణంగా కోతకు గురై కొంతమేరకు కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో శనివారం గ్రామస్తులు శ్రమదానంతో కొట్టుకుని పోయిన చోట రాళ్లను పేర్చి, పైన మట్టి పోసి తాత్కాలికంగా ప్రయాణానికి అనుకూలంగా చేశారు. సర్పంచ్ భర్త ఆకుల రుద్రప్రసాద్‌తో పాటు వార్డు సభ్యులు శ్రమదానం చేయగా గ్రామస్తులు అభినందించారు.

### చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి




శ్రీకాంత్ (ఫైల్)

నెక్కొండ: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నకొర్పోలు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంద శ్రీకాంత్ (26)తన అన్న అశోక్‌తోపాటు స్నేహితులు కొయ్యడ అనిల్, అన్నబోయిన ప్రశాంత్‌లు కలిసి శనివారం గ్రామ సమీపంలోని వట్టివాగును చూసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వట్టి వాగు ఆయకట్టుపై వరదలో చేపలు పట్టేందుకు ఉపక్రమించారు. శ్రీకాంత్ చేపల వల విసిరే క్రమంలో కాలు జారి కింద ఉన్న బండలపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై వరదలో కొట్టుకొని పోయి చెట్టు కొమ్మలకు చిక్కాడు. ఇది గమనించిన గ్రామస్తులు శ్రీకాంత్‌ను ఒడ్డుకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. భార్య ప్రవళిక ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న శ్రీకాంత్ వారం రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి వెళ్తామనుకున్న సమయంలో ఇలా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీపాష తెలిపారు.

# జనాలూ.. జర పైలం

**విజృంభిస్తున్న జ్వరాలు**

- నిలిచిన వర్షం నీటితో అనారోగ్యమే
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే జ్వరాలకు చెక్
- జిల్లాలో ఐదు రోజుల్లో 54 ఫీవర్ కేసులు
- నెలన్నర వ్యవధిలో 234 మంది జ్వర పీడితులు
- అనారోగ్యం అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి



చెన్నారావుపేటలో డ్రెయినేజీ లేకపోవడంతో నిలిచిన మురుగు నీరు (ఫైల్)



సాక్షి, వరంగల్: వారం రోజులుగా వర్షం దంచి కొట్టింది. వరంగల్ సిటీలోని చెరువులు, నాలాలు ఏరులై పారి కాలనీల్లోకి వరద నీరు చేరింది. గురువారం నుంచి వాన కాస్త తెరిపినివ్వడంతో కాలనీల్లోకి చేరిన వరద నీరు క్రమేణా తగ్గుతోంది. చాలా చోట్ల కాలనీల్లో నీరు నిల్వ ఉంది. కొన్ని కాలనీల్లో వరద నీరు పోయినా బురద మట్టితో వాసన వెదజల్లుతోంది. ఇళ్లన్నీ నీళ్లలో నానడంతో సామగ్రి అంతా తడిసి దుర్వాసన వస్తోంది. అలాగే పల్లెల్లోనూ రోడ్ల వెంట నిలిచిన వాన నీటితో లార్వాలు, దోమలు వృద్ధి చెంది ప్రజలకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వైరల్ ఫీవర్‌కు చెక్ పెట్టవచ్చని వైద్యులు అంటున్నారు. ఇప్పటికే వర్షాకాల సీజన్ ప్రారంభమై నెలన్నర గడుస్తున్న నేపథ్యంలో 178 జ్వర కేసులు నమోదయ్యాయి. తాజాగా దంచికొట్టిన వానలతో ఇప్పుడు ఆ సంఖ్య నాలుగింతలైనా ఆశ్చర్యపోనవసరం లేదని జిల్లా వైద్యాధికారులు అంటున్నారు. అలాగే నగరం, పట్టణాలు, మున్సిపాలిటీ, పల్లెల్లో పంచాయతీ సిబ్బంది రోడ్లు పరిశుభ్రం చేయడంతో పాటు డ్రెయినేజీల్లో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటే జ్వరాలు నియంత్రణలో ఉండే అవకాశాలున్నాయి.

**ఐదు రోజుల్లో 54 కేసులు..**

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23 నుంచి శుక్రవారం వరకు 54 జ్వర కేసులు నమోదయ్యాయి. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా ఇంతమంది బాధితులు ఉన్నారంటే.. వరుణుడు తెరిపినిచ్చాక ఉండే అపరిశుభ్రతతో జ్వరాలు ఓ స్థాయిలో విజృంభించే అవకాశాలు ఉన్నాయి. ఇంకోవైపు మలేరియా, డెంగీ కేసులు కూడా నమోదయ్యే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే అన్నీ సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో సిబ్బంది సేవలను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా రోగులకు మెరుగైన వైద్య సేవల కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఫీవర్ వార్డును నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు పునరావాస కేంద్రాల్లోనూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఉన్న వారి లీవ్‌లను రద్దు చేసి మరీ ఆయా ఆరోగ్య కేంద్రాల విధుల్లో ఉండాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సేవలు అందిస్తున్నారు.

### వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారులు, సిబ్బంది లీవ్‌లు రద్దు చేశాం
- పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు వైద్యసేవలు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ
- 'సాక్షి'తో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ



గీసుకొండ: జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో నీరు నిలిచి నగర ప్రాంతాలు, పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తేలా ఉన్నాయి. ఫలితంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే.. భారీ వర్షాల నేపథ్యంలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించేలా చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది లీవ్‌లు రద్దు చేశాం. వరంగల్ నగరంలోని ముంపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 20 పునరావాస కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో వైద్యం, మందులు అందించడం జరుగుతుంది. అన్ని పీహెచ్‌సీల్లో పాము, తేలు, కుక్క కాటు మందులతో పాటు జ్వరం, దగ్గు, జలుబు, కలుషిత ఆహారం, నీరు ద్వారా వచ్చే డయేరియా నివారణ మందులు అందుబాటులో ఉన్నాయి. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. జ్వరపీడితులు ఉంటే వారికి మందులు ఇస్తున్నారు. నగరంతో పాటు ఖానాపురం, బానోజీపేట, రాయపర్తి (డబ్ల్యూ), నెక్కొండ, గీసుకొండ, పర్వతగిరి తదితర పీహెచ్‌సీ ప్రాంతాలను డెంగీ, మలేరియా సోకే సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి దోమలు, జ్వర నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కలుషిత ఆహారం, నీరు తీసుకోవద్దు. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- సిబ్బందిని అప్రమత్తం చేశాం
- సైడు కాల్వలను శుభ్రం చేయిస్తున్నాం
- ప్రజలు సహకరించాలి
- 'సాక్షి'తో డీపీఓ కల్పన



కరీమాబాద్: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీపీఓ కల్పన చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో సైడ్ కాల్వలు కూరుకుపోవడం, వరదకు రోడ్లు కొట్టుకు పోవడం లాంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో ఇప్పుడు చేపట్టనున్న పారిశుద్ధ్య పనుల గురించి 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు డీపీఓ మాటల్లోనే.. జిల్లాలోని 323 గ్రామ పంచాయతీల్లో సైడ్ కాల్వలు శుభ్రం చేయడం, ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించడం చేస్తున్నాం. ట్రాక్టర్ ద్వారా ఇళ్లలో వాడిన వ్యర్థ పదార్థాలను తీసుకెళ్లి డంపింగ్ యార్డులో డంప్ చేయడం జరుగుతుంది. ఇంటి ఆవరణ, డ్రమ్ములు, కుండీలు, టబ్బుల్లో నీరు నిల్వ లేకుండా పారబోయడం జరుగుతుంది. దోమలు నిల్వ ఉండకుండా, వృద్ధి చెందకుండా నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం చేస్తున్నాం. సైడ్ కాల్వల్లోని బురదను తొలగించి శుభ్రం చేయడం, గండ్లు పడిన రోడ్ల వద్ద మొరం పోయించడం జరుగుతోంది. కాచి వడబోసిన నీటినే తాగాలి. లేదంటే వాంతులు, విరేచనాలు, డయేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దోమలు, ఈగలతో మలేరియా, విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి సైడ్‌కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తాం. ప్రతీ పంచాయతిలో రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయించడం జరుగుతుంది. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే ఎలాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదు. వర్షాకాలం ఇంకా ముందుంది కాబట్టి ప్రజలు మరింత పరిశుభ్రత పాటించాలి.

## త్యాగానికి ప్రతీక మొహర్రం



నర్సంపేట: పట్టణంలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తూ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో ముస్లిం మత పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయపర్తి: కాట్రపల్లిలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

## ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

- డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్: వర్షాలు వచ్చిన ప్రతీసారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా బీఆర్‌ఎస్ నేతలు తొమ్మిదేళ్లుగా ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజులుగా వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఆగకుండా చేస్తామన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వరద బాధితులకు తక్షణ సాయంగా కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. లీడర్లు నాలాలపై కట్టిన అక్రమ కట్టడాలను తొలగిస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎంబాడి రవీందర్, మహ్మద్ అయూబ్, కర్నాటి పార్వతమ్మ, నమిండ్ల శ్రీనివాస్, కరాటే ప్రభాకర్, జన్ను రవి, దాసి రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యతను కాపాడాలి



మాట్లాడుతున్న ముఖ్య అటవీ సంరక్షణాధికారి భీమా

న్యూశాయంపేట: పర్యావరణ సమతుల్యతను కాపాడాలని వరంగల్, భద్రాద్రి జోన్ ముఖ్య అటవీ సంరక్షణ అధికారి డి.భీమా సూచించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అడవిలో పులి ఉన్నప్పుడే పర్యావరణ సమతుల్యత ఉంటుందని వివరించారు. అదేవిధంగా సంవత్సర కాలంలో జూపార్కులో సందర్శకులకు పులి కనిపించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాద్రి జోన్‌లో పులి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకునే విధంగా అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి జె.వసంత, రిటైర్డ్ డీఎఫ్‌ఓ పురుషోత్తం, రిటైర్డ్ ఎఫ్‌డీఓఎస్ సత్యనారాయణ, జూపార్ ఇన్‌చార్జ్ రేంజ్ ఆఫీసర్ విలాసాగరపు రాజు, దేవాచారి, సారయ్య, వీరభద్రరావు, నరేశ్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీలకు పెద్దపీట

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 23 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా అనేక కుటుంబాలు ఆర్థికాభివృద్ధి పొందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మైనార్టీ కార్పొరేషన్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి**

రేషన్ డీలర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు ధారావత్ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని రేషన్ డీలర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగమల్లి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు అనంతుల రాంనారాయణ, కోశాధికారి ఉడుగుల పద్మరాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శశిరేఖచంద్రమౌళి, రాంచందర్‌రావు,ఉపాధ్యక్షుడు జి.జయమ్మశ్రీనివాస్, పి.రేణుక, జి.రాజు, కుమారస్వామి, రవివర్మ, నిర్మల, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



ఇంజనీరింగ్ అధికారులను నిలదీస్తున్న కొండేటి శ్రీధర్, ధర్మారావు

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంతోనే ప్రమాదస్థాయికి చేరుకోవడంతో మత్తడి రాళ్లను తొలగించారని, ఈ పరిస్థితికి ఎమ్మెల్యే అరూరి నిర్లక్ష్యమే కారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి కోనారెడ్డి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు, రైతుల డిమాండ్ మేరకు గత సంవత్సరం రూ.13.60 కోట్ల నిధులు మంజూరీ చేయగా, పనులు చేపట్టి సంవత్సరం గడిచినా పూర్తి కాకపోవడం ఎమ్మెల్యే అరూరి రమేష్, అధికారుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. కోనారెడ్డి చెరువు పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని, లేదంటే రైతుల తరఫున బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు చీటూరి అశోక్, బన్న ప్రభాకర్, చీటూరి రాజు, ఐత రవి, రాయపురం కుమారస్వామి, బోంపెల్లి దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల వసూళ్లలో గోల్‌మాల్!

**ఒకరి సర్వీస్ నంబర్‌పై మరొకరికి చెల్లింపు**

- జూనియర్ అసిస్టెంట్లు లేకపోవడంతో సిబ్బందిపై అదనపు పనిభారం
- డివిజన్ వ్యాప్తంగా ఒక్కరు కూడా లేని వైనం



ఈ ఫొటోలోని వ్యక్తి నల్లబెల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కన్నెబోయిన రవి. ఈయన తన తండ్రి బుచ్చయ్య పేరుమీద సర్వీస్ నంబర్ 171 ఉంది. గత నెల రూ.1,300 విద్యుత్ బిల్లు రావడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు చెల్లించారు. అయితే లైన్ ఇన్‌స్పెక్టర్ పని ఒత్తిడితో మేడపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారుడి పేరుపై బిల్లు చెల్లించాడు. దీంతో బుచ్చయ్యకు చెందిన బిల్లులో రూ.1,300 జమకాలేదు. ఈ విషయమై వినియోగదారుడు నిలదీయడంతో బిల్లును సరిచేసి న్యాయం చేస్తామని సదరు ఉద్యోగి చెప్పాడు. ఇలా డివిజన్ వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లు లేకపోవడంతో విద్యుత్ జమలో గోల్‌మాల్ జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.

నల్లబెల్లి: విద్యుత్ వినియోగదారులు చెల్లించిన బిల్లులు జమచేయడంలో గోల్‌మాల్ జరుగుతున్నాయి. నల్లబెల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లు మరొకరిపై జమ అయినట్లు వెలుగుచూసింది. విద్యుత్ బిల్లుల వసూలులో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్లు లేని లోపం స్పష్టంగా కనిపడుతోంది. ఫలితంగా విద్యుత్ వినియోగదారులు నష్టపోతున్నారు. విద్యుత్ బిల్లులు వసూలు చేయాల్సిన జూనియర్ అసిస్టెంట్లు నర్సంపేట డివిజన్ పరిధిలో 8 పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రాథమిక స్థాయిలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారు. నర్సంపేట డీఈ పరిధిలో 8 మంది జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తూ విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి. కానీ డీఈ పరిధిలో కనీసం ఒకరు కూడా లేకపోవడంతో జూనియర్ లైన్‌మెన్లు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు బిల్లు వసూలు బాధ్యతలను అదనంగా అప్పగించారు.




వినియోగదారుడు చెల్లించిన రశీదు

ఇది విద్యుత్ వినియోగదారులకు శాపంగా మారింది. అదనపు పని భారంతో విద్యుత్ సిబ్బంది చేస్తున్న తప్పిదాలతో వినియోగదారులు విద్యుత్ బిల్లు చెల్లించినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. బిల్లు తగ్గడంలేదని వాపోతున్నారు. విద్యుత్ బిల్లుల వసూలు చేయడం కష్టంగా మారుతుందని లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకొని జూనియర్ అసిస్టెంట్లను నియమించి బిల్లుల వసూలు బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు.

**డిజిటల్ పేమెంట్‌లు చేయాలి**



జూనియర్ అసిస్టెంట్లు లేకపోవడంతో సిబ్బందితో బిల్లులు వసూలు చేయిస్తున్నాం. ఈ క్రమంలో వినియోగదారులకు ఏమైన సమస్యలు తలెత్తితే సరిచేస్తున్నాం. విద్యుత్ వినియోగదారులు బిల్లుల చెల్లింపులో డిజిటల్ పేమెంట్స్ చేస్తే సంస్థకు మేలు.

– సదానందం, ఎన్పీడీసీఎల్ డీఈ, నర్సంపేట

### వేయిస్తంభాల గుడి ప్రధానార్చకుడిగా గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: తెలంగాణ అర్చక ఉద్యోగ జేసీ చైర్మన్, శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయ ఉపప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మను ప్రధానార్చకుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఆలయ ఆదాయాన్ని అనుసరించి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, రీజినల్ కమిషనర్ ఎం.రామకృష్ణారావు ఆదేశాల మేరకు ఉపేంద్రశర్మకు ఆలయ ఈఓ కె.వెంకయ్య ఉత్తర్వుల కాపీని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ దేవాలయంలో పూజాకార్యక్రమాలను ఆగమానుసారంగా నిర్వహిస్తూ, భక్తులకు సేవలందిస్తూ, దేవాలయ అభివృద్ధికి ఉపేంద్రశర్మ చేసిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.

### కమిషనరేట్‌లో పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డి.రమణబాబు వెయిటింగ్ నుంచి ఏసీపీ వరంగల్ సీటీసీకి, పి.సాంబయ్య సీటీసీ వరంగల్ నుంచి సీసీఎస్ సిద్దిపేట, ఎం.జితేందర్‌రెడ్డి వరంగల్ టాస్క్‌ఫోర్స్ నుంచి సీఎస్‌బీ వరంగల్, ఎల్.రమేష్‌కుమార్ వెయిటింగ్ ఎస్‌బీ నుంచి సెక్యూరిటీ వింగ్ వరంగల్, ఎం.భోజరాజు ఏసీపీ సెక్యూరిటీ వింగ్ వరంగల్ నుంచి ట్రాఫిక్ వరంగల్, ఎ.మధుసూదన్ ట్రాఫిక్ వరంగల్ నుంచి టాస్క్‌ఫోర్స్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

## క్లుప్తంగా

### పలు రైళ్లు రద్దు

● జూలై 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు..



**కాజీపేట రూరల్:** కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ నిర్వహణతో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 31 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం విచారణ కౌంటర్ వద్ద రైళ్ల రద్దు బోర్డును డిస్‌ప్లే చేశారు.

**రద్దయిన రైళ్ల వివరాలు**

కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్ (07753), డోర్నకల్–కాజీపేట (07754) ప్యాసింజర్, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–సిర్పూర్ (17003) సింగరేణి, సిర్పూర్ –కాజీపేట (17004) సింగరేణి, కాజీపేట–బల్లార్షా (17035), బల్లార్షా –కాజీపేట (17036), భద్రాచలంరోడ్–బల్లార్షా (17033), బల్లార్షా–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

### కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

● పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి

**కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30 ,31 ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు, పీజీ కోర్సులకు సంబంధించి నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్‌కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.



# సర్వస్వం పోయింది.. ఆదుకోండి..

● ఆపన్నహస్తం కోసం మోరంచపల్లి వాసుల ఎదురుచూపు
● ముందుకు వస్తున్న నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు
● నిత్యావసరాలు పంపిణీ చేయని అధికారులు
● నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్న బాధితులు



కన్నీటి గాథ



వరదల్లో కొట్టుకుపోయిన చెంచు కాలనీ



తడిసిన పాడైన సూపర్‌మార్కెట్ సామగ్రి

**భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. వరదలో నిత్యావసరాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కోల్పోయారు. కట్టుకోవడానికి బట్టలు.. కప్పుకోవడానికి దుప్పటి కుడా లేని దుస్థితి నెలకొంది. వరదల నుంచి తేరుకొని మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో నష్టపరిహారం ఇస్తుందా లేదా అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆపన్నహస్తాల కోసం ఎదురు చుస్తున్నారు. గ్రామంలో ఏ ఒక్కరిని కదిలించినా క‘న్నీరే’ ఉబికి వస్తోంది. కాగా, నిత్యావసర వస్తులు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

**ప్రభుత్వం నుంచి అందని తక్షణ సాయం**

ఊరికి ఊరంత వరదలో మునగడంతో కట్టుబట్టలతో బయటికి వచ్చిన బాధితులకు ప్రభుత్వం నుంచి కనీసం తక్షణ సాయం కూడా అందలేదు. నిత్యావసర వస్తువులు, బియ్యం కూడా పంపిణీ చేయలేదు. నష్టపోయిన ఆస్తికి, పశువులకు పరిహారం కింద ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

10 ఇళ్లు వరద తాకిడి దెబ్బతినగా చెంచుకాలనీకి చెందిన 18 గుడిసెలు వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్క ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోరంచపల్లి బస్టాండ్ సమీపంలోని సంతోషిమాత సూపర్‌మార్కెట్‌లో రూ. 20లక్షల విలువైన కిరాణా సామగ్రి తడిసి పాడైంది.

**ముందుకు వస్తున్న పలువురు..**

మోరంచపల్లిలో జరిగిన నష్టాన్ని చూసిన పలువురు చలించిపోతున్నారు. పగవారికి కూడా ఇలాంటి కష్టం రావొద్దని వేడుకుంటున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు వచ్చి బియ్యం, కూరగాయలు, వంట సామాను, చద్దర్లు, మ్యాట్లు, పండ్లు, పప్పులు, చీరలు, ఇతర వస్తువులు ఇంటింటికీ తిరుగుతూ బాధితులకు అందజేస్తున్నారు.

### రూ.20 లక్షల నష్టం జరిగింది



మోరంచపల్లిలో వచ్చిన వరదతో మా సూపర్‌మార్కెట్‌లో రూ.20లక్షల విలువైన వస్తువులు తడిసి పాడయ్యాయి. చక్కెర, పప్పు, పిండి, బియ్యం ఇతర వస్తువులు పాడయ్యాయి. అప్పు తెచ్చి షాపు ఏర్పాటు చేసుకున్న. వస్తువులు కొనుగోలు చేసిన సెట్లకు ఇంకా డబ్బు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొడ్డశాని సంతోష్, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు

### ఇంటికి రూ. 4లక్షలు ఇవ్వాలి



వరద ఉధృతిలో సర్వం కోల్పోయాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.4లక్షలు ఇచ్చి ఆదుకోవాలి. వరదలో 3 తులాల బంగారం, రూ.15వేల నగదు, వంట గ్యాస్, భూమి పాస్‌పుస్తకాలు, ఇతర వస్తువులు కొట్టుకుపోయాయి. మిగిలిన వస్తువులను కడుకుంటున్నాం. ఇప్పటికీ ఒక్క అధికారి కూడా వచ్చి నష్టం గురించి సర్వే చేయలేదు.

–సూరం రాజయ్య, వరద బాధితుడు

### రూ.3 లక్షల నష్టం జరిగింది



వరద కారణంగా కొన్ని వస్తువులు తడిశాయి. మరి కొన్ని వస్తువులు కొట్టుకుపోయాయి. రూ.లక్ష విలువైన బండి కొట్టుకుపోయింది. ఫ్రిడ్జి, కూలర్, బట్టలు, ఇతర వస్తువులు తడిశాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

–కోటగిరి తిరుమల, మోరంచపల్లి వరద బాధితురాలు

### గ్రామాన్ని తరలించాలి..



2001లో గ్రామానికి భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. అప్పుడే గ్రామాన్ని తరలించాలని వేడుకున్నాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం వచ్చిన వరదలకు గ్రామంలో నలుగురు కొట్టుకుపోయారు. గ్రామస్తులమందరం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మోరంచపల్లి గ్రామాన్ని తరలించాలి.

–కర్ర పుష్పలీల, మోరంచపల్లి వరద బాధితురాలు

# అన్ని విధాలా ఆదుకుంటాం

● బాధితులకు ప్రభుత్వం అండ
● నష్టం అంచనా వేశాం.. త్వరలో పరిహారం
● రాజకీయాలకు ఇది సమయం కాదు
● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

**హన్మకొండ అర్బన్ :** వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ప్రాథమికంగా రూ.414 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇందులో వరంగల్ జిల్లాలో రూ.89 కోట్లు, హనుమకొండలో రూ.146 కోట్లు, గ్రేటర్ పరిధిలో రూ.179 కోట్లు అంచనా వేశామన్నారు. 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4668 మంది బాధితులను తరలించామన్నారు. గ్రేటర్ పరిధిలో 38 రెస్క్యూ టీమ్‌ల ద్వారా 2,055 మందిని రక్షించామని తెలిపారు. 207 ఇళ్లు పూర్తిగా, 480 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలో పరిహారం అందజేస్తామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ముందు చూపుతో ప్రమాదం తప్పిందన్నారు. భద్రకాళి చెరువుకు గండి పడిందనే విషయం తెలుసుకున్న అధికారులు.. ప్రాణహాని కలుగకుండా వెంటనే చర్యలు చేట్టారన్నారు. వరద బాధితులకు సహకారం అందజేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు 14 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. 154 ప్రాంతాలు జలమయయ్యాయని తెలిపారు. బీటీ రోడ్లు 38 కిలో మీటర్లు, సీసీ రోడ్లు 43 కిలోమీటర్లు, మెటల్ రోడ్లు 95 కిలో మీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. వర్షాలకు వరంగల్‌లో ఒకరు, హనుమకొండలో ఆరుగురు మృతి చెందారన్నారు. హనుమకొండలో 4137 చెరువులు దెబ్బతిన్నాయన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి వరంగల్‌లో 22 కిలోమీటర్లు, హనుకొండలో 22 కిలోమీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టం కూడా అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టొద్దని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి చెరువు మరమ్మతులు వెంటనే చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, తదితరులు పాల్గొన్నారు.

### బాలికలకు అస్వస్థత



చికిత్స పొందుతున్న మీనాక్షి, రుత్విక

**గూడూరు:** మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు బాలికలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఊట్లకు చెందిన బానోతు మీనాక్షి ఇంటర్ మొదటి సంవత్సరం, బ్రాహ్మణపల్లికి చెందిన మేరుగు రుత్విక అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇద్దరు కొంత కాలంగా శ్వాస కోశ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బాలికలు శ్వాసకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన ఉపాధ్యాయులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాలికలు ఆరోగ్యంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



తడిసిన రికార్డులను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

**హన్మకొండ:** భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయంగా పని చేస్తున్నారని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. శనివారం వరంగల్ బొంది వాగులో కూలిన 33 కేవీ లైన్ విద్యుత్ టవర్‌ను పరిశీలించారు. అనంతరం వరంగల్ పోతన నగర్‌లో నీట మునిగిన విద్యుత్ ఈఆర్ కార్యాలయాన్ని సందర్శించారు. తడిచిన రికార్డులు పరిశీలించారు. రికార్డులు తడి ఆరబెట్టి భద్రపరచాలని సూచించారు. అదే విధంగా వరద ఉధృతి తగ్గిన తర్వాత బొంది వాగులో కూలిన టవర్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని చోట్ల విద్యుత్ సరఫరా అందించగలిగామని, 24/7 ఉద్యోగులందరూ ఫీల్డ్‌లో ఉంటూ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లిఖార్జున్, డీఈ(టెక్నికల్) అనిల్ కుమార్, ఏడీఈ పి.శ్రీనివాస రెడ్డి, ఏఈ మహేందర్ పాల్గొన్నారు.

### కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని..

● విద్యార్థి ఆత్మహత్య

**హసన్‌పర్తి:** కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా 56వ డివిజన్ పరిమళ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి తండ్రి శనివారం కేయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీకి చెందిన కందకట్ల జనార్దన్ కుమారుడు గౌతం (21) నగరంలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. హాజరు నమోదు తక్కువగా ఉండడంతో ఎగ్జామ్స్ ఫీజు తీసుకోవడానికి యాజమాన్యం నిరాకరించింది. దీంతో మనోవేదనకు గురైన గౌతం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

## పలువురి గల్లంతు.. మృతదేహాలు లభ్యం

భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గల్లంతైన పలువురి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.



లక్ష్మి(ఫైల్)

**వెంకటాపురం(ఎం):** మండలంలోని నల్లగుంట పరిధి బిలుగుకుంటలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. నల్లగుంట గ్రామానికి చెందిన సాద లక్ష్మి గత గురువారం బిలుగుకుంట వైపు వెళ్లి కాలువలో పడి వరదలో కొట్టుకుపోయింది. కాగా, మూడు రోజులుగా కుటుంబ సభ్యులు.. లక్ష్మి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం ఉదయం నీటి వనరుల్లో వెతకగా బిలుగుకుంటలో లక్ష్మి మృతదేహం కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

**నడికూడలో గుర్తుతెలియని మహిళ మృతదేహం..**

**నడికూడ:** మండల కేంద్రంలోని పెద్ద చెరువు పక్కన గల చింతలపల్లి భీమ్‌రావు పొలంలోకి శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం వరదకు కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. కేవలం అస్థిపంజరంతో ఉన్న మృతదేహాన్ని సీఐ వెంకట్ రత్నం, ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ పంచనామా నిర్వహించి ఖననం చేశారు. అనంతరం వీఆర్‌ఏ అంబి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.

**జంపన్నవాగులో వ్యక్తి మృతదేహం..**

**ఎస్ఎస్‌తాడ్వాయి :** మండలంలోని గోనెపల్లి గొత్తికోయ గూడేనికి చెందిన నందయ్య (50) మృతదేహం లభ్యమైంది. మేడారం జంపన్నవాగు సమీపంలోని మామిడి తోటకు కాపాలా ఉంటున్న ఆయన.. గురువారం జంపన్నవాగు వరదలో గల్లంతయ్యాడు. వరద తగ్గడంతో వాగు పక్కన ఇసుకలో శనివారం నందయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహం బయటకు తీసి పంచనామా నిర్వహించారు.

## నేడు ఉమ్మడి జిల్లాలో కిషన్‌రెడ్డి పర్యటన



గండిని పరిశీలిస్తున్న రావు పద్మ

**హన్మకొండ :** కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదివారం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లాకు చేరుకుంటారని వివరించారు. జనగామలో ఉదయం 9.30 గంటలకు అల్పాహారం చేసి అక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చేరుకుంటారన్నారు. మోరంచపల్లిలో గంట పర్యటిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రేగొండకు చేరుకుని మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు నగరానికి చేరుకుని హనుమకొండ, వరంగల్‌లో వరద ప్రభావిత ముంపు ప్రాంతాలను సందర్శిస్తారు.


**భద్రకాళి చెరువును పరిశీలించిన రావు పద్మ**

వరంగల్ పోతన నగర్ వద్ద భద్రకాళి చెరువుకు పండిన గండిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పరిశీలించారు. ఆమె వెంట నాయకులు ప్రీతీష్, ఆకాష్ ఠాకుర్, నదియా, నరేష్, పవన్, గౌతం, వినీత్ ఉన్నారు.

# ప్రతికూల పరిస్థితుల్లో..

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

● తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకోవాలి
● పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలి
● కేవీకే శాస్త్రవేత్త రాజు







డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

**కరీమాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వివిధ పంటలు నీట మునుగుతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఫలితంగా లక్షలాది రూపాయల పెట్టుబడి నీటిపాలు అవుతోంది. దీంతో రైతులు ఘొల్లుమంటున్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు అన్నారు. తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకుని తర్వాత దశల్లో దిగుబడి తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**పత్తి..**



వర్షాభావ పరిస్థితులతో పత్తి మొక్కలు సుమారు 30 రోజుల దశలో ఉన్నాయి. వర్షపు నీరు నిలిస్తే ఆకులు ఎర్రగా మారి చనిపోతాయి. ఈ నేపథ్యంలో నీటిని బయటకు పంపి ఎకరాకు 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. వర్షం తగ్గిన అనంతరం అవసరం మేరకు పొటాషియం నైట్రేట్ 2 శాతం 20 గ్రాములు నీటిలో కలిపి పది రోజులలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వాలిపోతే కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో కలిపి మొక్కల దగ్గర పోయాలి. మొక్క నీరసంగా ఉంటే 13–0–45ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ క్రమంలోనే 19–19–19, మల్టీ–కె లాంటివి పిచికారీ చేయాలి.

**వరి..**



నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చిన్నమొలకలు అధిక నీటిని తట్టుకోలేవు. ఈ నేపథ్యలో వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న రైతులు పొలాల్లో, మడులలో నిలిచిన నీటిని తొలగించాలి. వర్షాలు తగ్గాక నారు ఎర్రబడే అవకాశముంది. మడిలో మోతాదు ప్రకారం యూరియా వేయాలి. కార్బన్డిజం, మ్యాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. నారు కొనలు ఎర్రగా మారితే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి. ఇక నాటు వేసిన రైతులు వరద ఉధృతి తగ్గగానే యూరియా వేయాలి. అవసరం మేరకు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.



**మొక్కజొన్న..**

మొక్కజొన్నలో అధిక తేమతో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఊద రంగులోకి మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఏపీ, 19–19–19 లాంటి యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

**కంది..**

అధిక తేమతో మొక్కలలో ఇనుము లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నివారణకు అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

**మిరప..**



మిరప పంట ప్రస్తుతం నారు మడి దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నీరు పోవడానికి కాలువలు చేసి ఉంచాలి. నారుమడిని పాలిథిన్ షీట్‌తో గాని, వరి గడ్డితో గాని వర్షం తగ్గే వరకు కప్పి ఉంచాలి. వర్షం తగ్గాక వేరు కుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మోతాదు ప్రకారం నీటిలో కలిపి మొదళ్ల దగ్గర పోయాలి.